# సాక్షి ఖమ్మం

శుక్రవారం ‖ 7 ‖ జూన్ ‖ 2024






**18 గంటలు పనిచేస్తున్నా...**

సింగరేణి కార్మికులు, ఉద్యోగులూ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని సీఎండీ బలరామ్ సూచించారు. 8లో



**నీరు అందితేనే సాగు భళా!**

గత యాసంగిలో సాగు నీరు అందక నష్టపోయిన రైతులు మళ్లీ అలాంటి పరిస్థితి రాకుండా బావుల్లో పూడిక తీయిస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం 35° / 26°

**వాతావరణం**

జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ మొదలవుతుంది. సాయంత్రం తర్వాత మాత్రం వాతావరణం చల్లబడే అవకాశముంది.

## రైతులకు అండగా 'సాక్షి'

**జిల్లా వ్యవసాయాధికారితో రేపు 'ఫోన్ ఇన్'**



ఎం.విజయనిర్మల

ఖమ్మం వ్యవసాయం: వానాకాలం పంటల సాగుకు సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యాన ఏ పంటలు సాగు చేస్తే మంచిది, ఎలాంటి విత్తనాలు ఎంచుకోవాలి, విత్తనాలు నాటడానికి ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నకిలీ విత్తనాల బారి నుంచి కాపాడుకోవడం ఎలా తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని 'సాక్షి' సంకల్పించింది. ఈమేరకు రేపు(శనివారం) ఫోన్ ఇన్ ఏర్పాటుచేయగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల రైతుల సందేహాలకు సమాధానాలు ఇస్తారు. వానాకాలంలో సాగు చేసే పంటలు, అనువైన విత్తనాలు, విత్తనాల లభ్యత, ఎరువుల వినియోగం తదితర అంశాలపై రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

తేదీ : 08 - 06 - 2024, శనివారం
సమయం : ఉదయం 9నుంచి 10 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్
**72888 94200**

## న్యూస్‌రీల్

### నూతన చట్టాలపై సంపూర్ణ అవగాహన

ఖమ్మంక్రైం: నూతనంగా అమల్లోకి రానున్న చట్టాలపై పోలీస్ ఉద్యోగులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఏసీపీలు వెంకటేష్, సాంబరాజు సూచించారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి కేంద్రప్రభుత్వం నూతన న్యాయచట్టాలను అమల్లోకి తీసుకురానున్నందున కేసుల నమోదు, దర్యాప్తు, విచారణ అంశాలపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పోలీసు ఉద్యోగులకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తుండగా.. గురువారం ఏర్పాటుచేసిన శిక్షణలో ఏసీపీలు మాట్లాడారు. ప్రజాభద్రత, సామాజిక న్యాయం కోసం చట్టాలకు రూపకల్పన చేశారని తెలిపారు. ఇప్పుడు అమల్లోకి రానున్న చట్టాలు శాంతిభద్రతల పరిరక్షణలో మైలురాయిగా నిలుస్తాయని చెప్పారు. ఈకార్యక్రమంలో సీఐ శ్రీధర్, ఎస్‌ఐలు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, గిరిధర్‌రెడ్డి, ఖుషకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### 16న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.ఉప్పల్‌రెడ్డి తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసేందుకు పోటీలు ఏర్పాటుచేయగా, అండర్ – 11, 13, 15, 17, 19 బాలబాలికలే కాక సీనియర్స్ విభాగంలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు జరుగతాయని పేర్కొన్నారు. ఆసక్తి క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈనెల 14వ తేదీలోపు బ్యాడ్మింటన్ కోచ్ హరీష్‌కు అందజేయాలని, వివరాలకు 81794 22953, 77320 61815 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### గ్రూప్-1 కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఖమ్మంక్రైం: ఈనెల 9వ తేదీన జరగనున్న గ్రూప్–1 ప్రిలిమనరీ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేయనున్నట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా, ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆంక్షలు అమలవుతాయని పేర్కొన్నారు. కేంద్రానికి 500 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపుగా ఉండొద్దని, సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించొద్దని సూచించారు. అంతేకాక కేంద్రాల పరిసరాల్లో ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు మూసివేయాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

### పాఠశాలలు, హాస్టళ్లకు సామగ్రి సరఫరాకు టెండర్లు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పాఠశాలలు, వసతిగృహాల్లో అవసరమైన కోడిగుడ్లు, అరటిపండ్లు, చికెన్, పాలు, గ్యాస్, కూరగాయల సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ అధికారిణి విజయలక్ష్మి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సీల్డ్ కవర్‌లో టెండర్లు సమర్పించాలని సూచించారు. ఈ సమయాన ఖమ్మం గిరిజన సంక్షేమ శాఖ పేరిట డీడీ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈనెల 19న టెండర్లు తెరిచి ఖరారు చేస్తామని వెల్లడించారు.

# సంక్షేమమా.. నీవెక్కడ?



శిథిలావస్థకు చేరిన ఖమ్మంలోని బీసీ బాలుర వసతిగృహ భవనం

సాక్షి ఫోకస్

- సమస్యలకు ఆవాసంగా ప్రభుత్వ వసతిగృహాలు
- విద్యార్థులకు కనీస మౌలిక వసతులూ కరువే
- అరకొర నిధులతో పరిష్కారం కాని వైనం
- విద్యాసంవత్సరం సమీపిస్తున్నా పట్టించుకోని యంత్రాంగం

ఖమ్మంమయూరిసెంటర్: వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు ఈనెల 12న తిరిగి తెరుచుకోనున్నాయి. ఈమేరకు రానున్న విద్యార్థులు మళ్లీ అరకొర సౌకర్యాల నడుమే చదుకోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. దాదాపు రెండు నెలల పాటు సెలవులు వచ్చినా వసతిగృహాల్లో ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోగా, కనీస వసతులు కల్పించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఎస్సీ, బీసీ, గిరిజన అభివృద్ధి శాఖల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సంక్షేమ వసతిగృహాల పరిస్థితి దయనీయంగా మారింది. మౌలిక వసతుల మాట పక్కన పెడితే పలు భవనాలు శిథిలావస్థకు చేరగా, ఇంకొన్ని ఇరుకైన ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయి.

**పేరుకే నిధులు**

ప్రభుత్వం పేదల విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి కల్పించేందుకు సంక్షేమ వసతిగృహాలను నిర్వహిస్తోంది. ఇందులో ఉండి విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పనకు నిధులు కేటాయిస్తుంది.



ఇది సత్తుపల్లిలోని బీసీ బాలుర హాస్టల్. ఇక్కడ 3 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు వసతి సదుపాయం ఉంది. ఏ గదిలో చూసినా చెదలు పట్టిన కిటికీలు, పగిలిపోయిన తలుపులే దర్శనమిస్తున్నాయి. భవనం ఎక్కడికక్కడ నెర్రెలు విచ్చి శిథిలావస్థకు చేరుకుంది. తాగునీటి సౌకర్యం కూడా లేదు. బాత్‌రూమ్‌లకు, టాయిలెట్లకు డోర్లు లేవు. అయినా వీటిని విద్యార్థులు వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఉంది.

### శాఖ ఏదైనా అవే సమస్యలు

**ఎస్సీ అభివృద్ధి శాఖ:** ఈ శాఖ పరిధిలో 41 ప్రీ మెట్రిక్ వసతి గృహాలు ఉండగా.. వీటిల్లో అనేక భవనాల్లో నల్లాలు, బాత్‌రూమ్ టైల్స్ పగిలి తలుపులు ఊడిపోయాయి. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో వర్షాకాలంలో కురిసి గోడలు నానే ప్రమాదం ఉంది. చాలాచోట్ల వసతిగృహాల్లో తాగునీటి సౌకర్యం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇక ఫైర్ సెఫ్టీకి సంబంధించి పరికరాలు పెట్టినా వాటి గడువు ముగిసినా పట్టించుకోవడం లేదు.

**బీసీ సంక్షేమశాఖ:** ఈ శాఖ ఆధ్వర్యాన 22 ప్రీ మెట్రిక్ వసతి గృహాలు కొనసాగుతున్నాయి. ఇందులో చాలా హాస్టళ్లలో అరకొర సౌకర్యాలే ఉన్నాయి. పలు చోట్ల గదులకు కిటికీలు లేకపోగా, తాగునీటి సమస్య వేధిస్తోంది. ఇక పలు భవనాలు నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈ సమస్యలపై అధికారులు ఏటా నివేదికలు పంపిస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు.

**గిరిజన సంక్షేమశాఖ:** ఈ శాఖ పరిధిలో పది ఆశ్రమ పాఠశాలలు, ఎనిమిది ప్రీ మెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. వీటిల్లో తాగునీటి సమస్య, మరుగుదొడ్లు, గదుల్లో అరకొర సౌకర్యాలు వేధిస్తున్నాయి. ఇక చేయాల్సిన మరమ్మతులను గుర్తించడంలో శాఖ అధికారులు విఫలమయ్యారు. జిల్లా కేంద్రంలోని ఎన్నెస్పీ క్యాంప్‌లోని కళాశాల బాలుర వసతిగృహంలో బాత్‌రూమ్‌లు లేక విద్యార్థులు ఆరుబయటనే స్నానం చేస్తున్నారంటే మారుమూల ప్రాంతాల్లోని హాస్టళ్ల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

అయితే వీటిపై పాలకులు, అధికారులు పెద్దగా శ్రద్ధ చూపకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. నిధులు విడుదల చేస్తున్నామని అధికారులు, ప్రభుత్వం చెబుతున్నా అవి అరకొరగానే ఉండడంతో కాంట్రాక్టర్లు సగం సగం పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఎస్సీ సంక్షేమశాఖలో గతేడాది కృషియల్ ఫండ్‌తో కొన్ని వసతిగృహాల్లో మరమ్మతులు చేయించినప్పటికీ చాలాచోట్ల సమస్యలు అలానే మిగిలిపోయాయి. ఇక బీసీ శాఖ వసతిగృహాల్లో పైపై పనులు చేపట్టి వదిలేశారు. గిరిజన శాఖలో సమస్యల పరిష్కారంపై అధికారులు కనీసం దృష్టి పెట్టే పరిస్థితి కూడా కానరావడం లేదు. ఇటీవల వసతిగృహాల్లో చేపట్టాల్సిన మరమ్మతులు, ఇతర సమస్యలపై ఆయా శాఖల అధికారులు నివేదికలను కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలుస్తోంది. కానీ వేసవి సెలవులు ముగియనుండడంతో విద్యార్థులు వస్తే పనులు చేపట్టడం ఇబ్బందిగానే ఉంటుందన్న చర్చ జరుగుతోంది.

**భవనాలన్నీ శిథిలావస్థకు...**



జిల్లాలోని సంక్షేమ వసతిగృహాలపై పాలకులు, అధికారులకు చిన్నచూపు ఉంది. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరి కూలే స్థితిలో ఉన్నాయి. అయినా అధికారులు స్పందించడం లేదు. ఇకనైనా వసతిగృహాల్లో కావాల్సిన మరమ్మతులు చేయించి కనీస సౌకర్యాలు కల్పించాలి.

– వంగూరి వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

**సమస్యలపై దృష్టి పెట్టాలి..**



త్వరలో పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో వసతిగృహాలు తెరవాల్సి ఉంది. అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో అనేక వసతిగృహాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కొన్నింట్లో నీటి వసతి కూడా కరువైంది. విద్యార్థులు ఈ ఏడాదైనా ఇబ్బంది పడకుండా సమస్యలు పరిష్కరించాలి.

– ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

## 'పవర్' ట్రాన్స్‌ఫార్మర్లు

- టేకులపల్లిలో రూ.1.25కోట్ల వ్యయంతో ఏర్పాటు
- ఇప్పటికే మమత రోడ్డులోనూ అందుబాటులోకి..

ఖమ్మం అర్బన్: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకుగాను అత్యాధునిక ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేస్తున్నారు. జిల్లా కేంద్రంలో నానాటికీ విద్యుత్ వినియోగం పెరుగుతుండడంతో ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన సబ్‌స్టేషన్ల సామర్థ్యం సరిపోవడం లేదు. ఈనేపథ్యాన ఇప్పటికే మమత రోడ్డులోని సబ్‌స్టేషన్‌లో అదనంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.

ఇక ఇల్లెందు క్రాస్ రోడ్ 33/11 సబ్ స్టేషన్ రెండు 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లతో కొనసాగుతుండగా, అందులో ఒకటి తొలగించి రూ.1.25 కోట్ల విలువైన 12.5 ఎంవీఏ(మెగా ఓల్ట్ యాంప్) పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఏర్పాటుచేసి ప్రారంభించారు. తాజాగా గురువారం ఖమ్మం టేకులపల్లి సబ్‌స్టేషన్‌లోనూ అంతే విలువైన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు. ఈ సబ్‌స్టేషన్‌ను 2022 ఆగస్టులో ప్రారంభించగా, లోడ్ పెరుగుతుండడంతో అత్యాధునిక ట్రాన్స్‌ఫార్మర్ బిగించినట్లు ఎస్‌ఈ సురేందర్, డీఈలు రామారావు, భద్రుపవార్ వెల్లడించారు. ఈ మేరకు సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా గురువారం వారు సరఫరా ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ నాగమల్లేశ్వరరావు, ఏఈ అశోక్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# నకిలీలు విక్రయిస్తే సహించేది లేదు

- రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు
- టాస్క్‌ఫోర్స్ బృందాలతో నిరంతరం తనిఖీలు
- ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీ చేసిన కలెక్టర్ గౌతమ్



విత్తనాల కొనుగోలుకు వచ్చిన రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్



కొణిజర్లలో యూనిఫామ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మంవ్యవసాయం: నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే ఎంతమాత్రం సహించేది లేదని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ హెచ్చరించారు. రైతులను నష్టపరిచేలా ఎవరు వ్యవహరించినా కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఖమ్మంలోని వివిధ ప్రాంతాల్లో ఎరువులు, విత్తన దుకాణాలను గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో విత్తనాల లభ్యత, డిమాండ్, రికార్డులను ఆయన పరిశీలించారు. రైతులు ఏయే రకాల విత్తనాలు ఎక్కువగా అడుగుతున్నారో ఆరా తీశారు. అంతేకాక కొందరు రైతులతో మాట్లాడి ఒకే రకం విత్తనాల కోసం ప్రయత్నించకుండా ప్రభుత్వం ఆమోదించిన ఏ రకమైనా కొనుగోలు చేయాలని అవగాహన కల్పించారు. కాగా, కొన్ని షాపుల్లో వ్యాపారులు ఎరువులు, విత్తనాల వివరాలను బోర్డులపై ఇంగ్లిష్ రాయడాన్ని గుర్తించిన కలెక్టర్ అందరికీ అర్థమయ్యేలా తెలుగులో రాయించాలని సూచించారు. అలాగే, జిల్లా వ్యాప్తంగా ఉన్న దుకాణాల్లో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా విత్తనాల కొరత లేదనే అంశంపై అవగాహన కల్పించాలని తెలిపారు. తనిఖీల్లో ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ బి.కిషోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

**బడులు తెరిచే నాటికి పనులు పూర్తి కావాలి**

కొణిజర్ల: పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కొణిజర్ల మండలం బస్వాపురం, అమ్మపాలెం పాఠశాలల్లో పనులను గురువారం ఆయన తనిఖీ చేసి సూచనలు చేశారు. ఆతర్వాత కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల యూనిఫామ్ సిద్ధం చేస్తుండగా పరిశీలించి మాట్లాడారు. పాఠశాల తెరిచిన మొదటిరోజే విద్యార్థులకు ఒక్కో జత యూనిఫాం ఇవ్వాలని స్పష్టం చేశారు. డీఈఓ సోమశేఖరశర్మ, ఎంపీడీఓ రోజారాణి, ఎంఈఓ ఎం.శ్యాంసన్, ఏపీఎం సుశీల, హెచ్‌ఎంలు కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**పకడ్బందీగా గ్రూప్–1 ప్రిలిమినరీ**

ఖమ్మం సహకారనగర్: ఈనెల 9వ తేదీన జరగనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆమె టీజీ గురువారం ఆమె టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డితో కలిసి వీసీ ద్వారా మాట్లాడారు. పరీక్ష ఏర్పాట్లు, వానాకాలం విత్తనాలు, ఎరువుల లభ్యత, తాగునీటి సరఫరా, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాల పంపిణీపై సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్–1 పరీక్షకు హాజరుకానున్న 18,403 మంది అభ్యర్థుల కోసం 52 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, వివిధ శాఖల అధికారులు ప్రసాదరావు, రాజేశ్వరి, విజయనిర్మల, సన్యాసయ్య, శ్రీనివాస్, సోమశేఖరశర్మ, ఆఫ్రిన్ సిద్ధిఖీ, భవానీప్రసాద్ పాల్గొన్నారు.

# 'పట్టభద్రుల' ఫలితంపై ఉత్కంఠ

- మొదటి ప్రాధాన్యతలో ఎవరికీ దక్కని గెలుపు
- లక్ష్యం 1,55,095 ఓట్లు..
- కొనసాగుతున్న రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు



ఓట్లు లెక్కిస్తున్న ఉద్యోగులు

నల్లగొండ: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు రెండు రోజులుగా కొనసాగుతుండగా ఫలితం మాత్రం తేలలేదు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికీ గెలుపునకు సరిపడా ఓట్లు రాలేదు. గెలుపు కోసం 1,55,095 ఓట్లు రావాల్సి ఉండగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లే వచ్చాయి. దీంతో అధికారులు ఎలిమినేషన్ ద్వారా రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తున్నారు. మొత్తం 52 మంది అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన చివరి అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తూ, వారికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియ గురువారం రాత్రి 10 గంటలకు ప్రారంభం కాగా, శుక్రవారం ఉదయానికి ఫలితం తేలే అవకాశం ఉంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ బుధవారం ఉదయం 8గంటలకు ప్రారంభమైంది. గురువారం రాత్రి 9గంటల వరకు నాలుగు రౌండ్లలో మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తిచేయగా, ఆతర్వాత రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొత్తం పోలైన ఓట్లలో చెల్లని ఓట్లు తీసేసి చెల్లిన ఓట్ల ఆధారంగా గెలుపు లక్ష్యాన్ని నిర్ణయించారు. దీంతో రెండో ప్రాధాన్యత లెక్కింపు అనంతరం 1,55,095 ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు.

**మొదటి ప్రాధాన్యత ఓట్లు ఇలా..**

మొదటి ప్రాధాన్యతలో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,313 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు 1,22,813 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 1,04,248 ఓట్లు వచ్చాయి. అలాగే, స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కు 29,697 మొదటి ప్రాధాన్యత ఓట్లు నమోదయ్యాయి.

**అభ్యర్థుల్లో టెన్షన్..**

మొదటి ప్రాధాన్యత ఓట్లలో మల్లన్న 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉండగా.. ఆయన గెలుపునకు ఇంకా 32,283 ఓట్లు రావాలి. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి గెలవాలంటే 50,847 ఓట్లు అవసరముంది. దీంతో రెండో ప్రాధాన్యత ఓట్లతో ఫలితం తేలనుంది. ఈనేపథ్యాన 10వేల ఓట్లు వచ్చిన అభ్యర్థులందరినీ ఎలిమినేట్ చేసి వారి రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. అయినా ఎవరికీ గెలుపునకు కూడా సరిపడా ఓట్లు రాకపోతే, స్వతంత్ర అభ్యర్థి అశోక్ ఓట్లను ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన 29,697 ఓట్లలో రెండో ప్రాధాన్యత ఎవరికి పడ్డాయో లెక్కించి విజేతను గుర్తిస్తారు. అదీ సాధ్యం కాకపోతే బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని సైతం ఎలిమినేట్ చేస్తారు.

# బడిబాట ప్రారంభం



ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీలో ఉపాధ్యాయులు

**తొలిరోజు అవగాహన ర్యాలీలు**

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో గురువారం బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలోని 1,264 ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించగా.. మొదటి రోజు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో వసతులపై ఫ్లెక్సీల ద్వారా అవగాహన కల్పించారు. కాగా, కలెక్టర్ గౌతమ్ కొణిజర్ల మండలంలో జరుగుతున్న ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను పరిశీలించి బడిబాట నిర్వహణపై సూచనలు చేశారు. ఇక డీఈఓ సోమశేఖరశర్మ ఖమ్మంలోని బాలాజీనగర్, కొణిజర్లలో, సీఎంఓ రాజశేఖర్ కొణిజర్ల మండలంలోని తనికెళ్లలో పర్యవేక్షించారు.

**నమ్మకం పెంచండి**

ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నందున విద్యార్థులకు మెరుగైన బోధన చేస్తూ తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచాలని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన బడిబాట నిర్వహణపై సమీక్షించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పాఠశాలల్లో వసతులు, వస్తున్న ఫలితాలను వివరించి ప్రవేశాల సంఖ్య పెరిగేలా చూడాలని తెలిపారు. డీఈఓ సోమశేఖరశర్మ, డీఆర్డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ వినోద్, సీపీఓ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ బి.మాలతి, వివిధ శాఖల అధికారులు రాంగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, మహమూది, జ్యోతి, వెంగమాంబ తదితరులు పాల్గొన్నారు.

# అజెండా సరిగా లేదు...

- డీసీసీబీ సమావేశాన్ని బహిష్కరించిన డైరెక్టర్లు
- చైర్మన్ ఎన్నిక అజెండాలో లేకపోవడంపై నిరసన
- ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలపై నిలదీత



డైరెక్టర్లతో చర్చిస్తున్న బ్యాంకు సీఈఓ ఆబిద్ ఉర్ రెహమాన్

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) పాలకవర్గ సమావేశాన్ని మెజారిటీ డైరెక్టర్లు బహిష్కరించారు. 42 అంశాలతో కూడిన అజెండాతో గురువారం ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన పాలకవర్గ సమావేశం ఉంటుందని డైరెక్టర్లకు సమాచారం ఇచ్చారు. అయితే, మెజారిటీ డైరెక్టర్లు వచ్చినప్పటికీ సమావేశాన్ని బహిష్కరించారు. పాలకవర్గంలోని 16 మంది సభ్యులకు గాను పది మంది బహిష్కరించగా, మరో ముగ్గురు వివిధ కారణాలతో గైర్హాజరయ్యారు. చైర్మన్‌తో పాటు మిగిలిన డైరెక్టర్లు మాత్రం సమావేశంలో పాల్గొన్నా కోరం లేకపోవడంతో ముందుకు సాగలేదు. కాగా, తుళ్లూరి బ్రహ్మయ్య, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, లక్కినేని సురేందర్‌రావు, బొర్ర రాజశేఖర్, మేకల మల్లిబాబు యాదవ్, చావా వేణుగోపాల కృష్ణ, జనగం కోటేశ్వర రావు, బోబోలు లక్ష్మణ్ రావు, మొదుగు పుల్లారావు, నూకల సైదులు సమావేశానికి బహిష్కరించగా, గొర్ల సంజీవరెడ్డి, కోరం జానకీరావు, పేరబత్తిన ప్రసాద్ గైర్హాజరయ్యారు.

**ఎవరికీ చెప్పకుండా బదిలీలు**

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయాన డీసీసీబీ ఉద్యోగులను బదిలీ చేశారని డైరెక్టర్లు ఆరోపించారు. అంతేకాక బదిలీల్లో అక్రమాలు జరిగాయన్నారు. పాలకవర్గ సమావేశాల్లో సూచనప్రాయంగానైనా చెప్పకుండా బదిలీలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. హెచ్ఆర్ పాలసీని అమలుచేయని కారణంగా పలువురికి అన్యాయం జరిగిందని తెలిపారు.

**బీఎంలే బాధ్యులా..**

ఎస్ఎస్‌టీ తదితర బ్రాంచ్‌ల్లో తప్పుడు ధృవపత్రాల ఆధారంగా ఇచ్చిన మార్ట్‌గేజ్ రుణాల వ్యవహారంలో తీసుకున్న చర్యలు కొందరు అధికారులను కాపాడేలా ఉన్నాయని డైరెక్టర్లు ఆరోపించారు. నిబంధనల ఆధారంగా రూ.10 లక్షలకు పైగా రుణాల మంజూరీలో డీజీఎం స్థాయి అధికారుల అనుమతి అవసరమని తెలిపారు. అయినా వారిని పక్కన బెట్టి కేవలం బ్రాంచ్ మేనేజర్లను బాధ్యులుగా చేయడం సరికాదన్నారు. ఈ అంశాన్ని కూడా అజెండాలో చేర్చాలని, అప్పటివరకు సమావేశాలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈమేరకు బ్యాంకు సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ డైరెక్టర్లను కలిసి సమావేశానికి ఆహ్వానించగా వారు ససేమిరా అనడంతో చివరకు కోరం లేక సమావేశం వాయిదా పడింది.

**ఎప్పుడు ఎన్నుకుంటారు?**

అజెండాలోని అంశాలు తమకు సమ్మతం కాదని సమావేశాన్ని బహిష్కరించిన డైరెక్టర్లు తెలిపారు. గత చైర్మన్‌పై అనర్హత వేటు క్రమాన వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుకు నిబంధనల ప్రకారం బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఆతర్వాత నూతన చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉన్నా అజెండాలో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. గత పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేయడమే కాక టెస్కాబ్ ఎండీ, జిల్లా సహకార అధికారికి లేఖలు ఇచ్చామని తెలిపారు. అయినప్పటికీ పట్టించుకోకపోవడం సరికాదని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### 43 సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం

ఖమ్మం లీగల్: జాతీయ లోక్ అదాలత్‌లోభాగంగా గురువారం 43 సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించారు. ఈ బెంచ్‌కు సైబర్ క్రైమ్ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి బి.రజిని అధ్యక్షత వహించారు.ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా జరిగిన మోసాల్లో డబ్బు కోల్పోయిన వారు సకాలంలో ఇచ్చిన ఫిర్యాదులతో ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుల బ్యాంక్ అకౌంట్లను జప్తు చేశారు. అయితే, ఆ డబ్బు తిరిగి బాధితులు పొందేలా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించడంతో సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖరరావు కేసులను లోక్ అదాలత్‌కు పంపించారు. దీంతో సంబంధిత పత్రాలను పరిశీలించిన లోక్ అదాలత్ బెంచ్ కేసులు పరిష్కరించి డబ్బు తిరిగి ఇప్పిస్తూ అవార్డు జారీ చేసింది. ఈకార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణీందర్, ఎస్‌ఐ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

### టార్గెట్ కోసమే 'డ్వాక్రా' ఖాతాల్లో నగదు

రఘునాథపాలెం: ఉన్నతాధికారులు విధించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు డ్వాక్రా సభ్యుల ఖాతాల్లో ఓ బ్యాంకు ఉద్యోగులు రుణం జమ చేసినట్లు తెలిసింది. రఘునాథపాలెం మండలం రేగులచలకకు చెందిన డ్వాక్రా గ్రూపులకు ఖమ్మం గాంధీచౌక్‌లోని ఓ బ్యాంక్ ద్వారా రుణం మంజూరైంది. ఆపై వడ్డీ చెల్లించాలని ఉద్యోగులు అడగడంతో సభ్యులు నివ్వెరబోయారు. గ్రామంలో సుమారు పది గ్రూపులకు రూ.2లక్షల చొప్పున గత మార్చి 31లోపే జమ చేసినట్లు తేలింది. సభ్యులంతా బ్యాంక్ అధికారులు, ఐకేపీ ఉద్యోగులకు ప్రశ్నించడంతో విషయం బయటపడగా.. 'సాక్షి'లో 'అడగకుండానే డ్వాక్రా గ్రూపు ఖాతాల్లో రుణాలు' శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. దీంతో గురువారం ఆయా గ్రూపు సభ్యులను బ్యాంకుకు పిలిపించిన ఓ అధికారి, జమ చేసిన మొత్తం తిరిగి తీసుకుని వడ్డీ రూ.27వేలు తానే చెల్లిస్తానని బదులిచ్చినట్లు తెలిసింది. ఈ విషయమై ఐకేపీ ఏపీఎం శారదను వివరణ కోరగా.. సీసీ, గ్రామదీపిక ద్వారా బ్యాంక్‌కు వెళ్లి వివరాలు ఆరాతీయగా మేనేజర్ టార్గెట్ కోసం జమ చేసినట్లు చెప్పి వడ్డీఆయనే చెల్లించేలా ఒప్పుకున్నారని తెలిపారు.

### భర్త వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

అశ్వాపురం: మండలంలోని జగ్గారం గ్రా మంలో భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన కోట నవీన్‌కు, బూర్గంపాడు మండలం అంబేద్కర్‌నగర్‌కు చెందిన గ్లోరి(20)కి కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఈక్రమంలో భర్త వేధింపులకు గురిచేస్తుండడంతో మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి కేసుపాక సీతమ్మ తన కుమార్తె మృతికి భర్త నవీన్ కులం పేరుతో దూషించడమే కాక వరకట్నం పేరుతో మానసికంగా, శారీరకంగా వేధించేవాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

### 'మహాలక్ష్మి'లో ప్రమాదం.. కార్మికుడికి గాయాలు?

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఓసీలో మట్టి వెలికితీత పనులు నిర్వహిస్తున్న మహాలక్ష్మి ఓబీ కంపెనీలో మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో గురువారం ఓ కార్మికుడికి గాయాలయ్యాయి. తెలిసిన సమాచారం ప్రకారం.. మధ్యాహ్నం బ్లాస్టింగ్ ముగిసిన అనంతరం ఇచ్చిన క్లియరెన్స్‌లో భాగంగా కింది బెంచ్‌కి వెళ్తున్న గ్రేడర్ బ్లేడ్ అడ్డుగా రావడంతో గ్రేడర్ ఒక్కసారిగా పల్టీ కొట్టింది. దీంతో ఆపరేటర్‌కు గాయాలు కాగా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించినట్లు తెలిసింది. ఈ విషయమై మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసచారిని ఫోన్‌ద్వారా వివరణ అడిగే ప్రయత్నం చేయగా కలవలేదు.

# నేను 18 గంటలు పనిచేస్తున్నా..

- ఉద్యోగులు ఎనిమిది గంటలు పనిచేయండి
- సింగరేణి కీర్తిని మరింత పెంచేలా ప్రయత్నిద్దాం
- ఇక నుంచి ప్రతి నెలా ఉత్పత్తి, సంక్షేమంపై సమీక్ష
- సింగరేణి సీఎండీ బలరామ్


సింగరేణి సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి తోడు సింగరేణిని ప్రత్యేక స్థానంలో నిలపాలనే సంకల్పంతో తాను రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని, ఉద్యోగులు నిబంధనల మేరకు ఎనిమిది గంటలు సక్రమంగా విధులు నిర్వర్తిస్తూ సహకరించాలని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ) ఎన్.బలరామ్ సూచించారు. మస్టర్ నమోదయ్యాక ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సీఎండీగా ఆయన బాధ్యతలు స్వీకరించిన ఐదు నెలలు పూర్తయిన సందర్భంగా గురువారం కొత్తగూడెంలోని కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సంస్థ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2వేల పరిశ్రమలు కొనసాగుతుండగా, సుమారు 10 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యాన కార్మికులు ఉన్నత స్థాయి అధికారి వరకు పోటీతత్వం పనిచేయాలని సూచించారు.

**లక్ష్యసాధనపై దృష్టి**

గడచిన ఆర్థిక సంవత్సరం రికార్డు స్థాయిలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడానికి అందరి కృషి కారణమని సీఎండీ తెలిపారు. ఇదేస్ఫూర్తితో ఈ ఏడాది 72 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రణాళికాయుతంగా పనిచేయాలని సూచించారు. రోజు, నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకునేందుకు చేరుకోవడం సులువవుతుందని చెప్పారు. ఏరియాల వారీగా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకెళ్తే పరిష్కారానికి పాటుపడతానని తెలిపారు. అలాగే, ఇక నుంచి ప్రతీ నెలా ఉత్పత్తి లక్ష్యం, సంక్షేమంపై సమీక్షిస్తామని చెప్పారు.

**ఇతర రంగాల్లోనూ ప్రవేశం**

బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా ఇతర రంగాల్లోనూ ప్రవేశించాలనే యోచనలో ఉన్నట్లు సీఎండీ తెలిపారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా ఇనుము, రాగి, తదితర ఖనిజ ఉత్పత్తులు చేపట్టాలని, ఆఫ్రికా ఖండంలో గనులు నిర్వహించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. నైనీ బొగ్గు బ్లాక్‌కు అనుసంధానంగా అక్కడి రాష్ట్రప్రభుత్వం సూచనలతో 1,600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అలాగే, మరో 232 మెగావాట్ల గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ప్లాంట్ నిర్మాణానికి టెండర్లు పిలిచామని, లోయర్ మానేరు డ్యాంపై 300 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, మల్లన్న సాగర్‌పై 500 మెగావాట్ల ప్లాంట్, రాజస్థాన్‌లో 500 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని తెలిపారు.

**ఆస్పత్రుల అప్‌గ్రేడ్**

సింగరేణి ఆదాయంలో సుమారు 30శాతం కార్మికుల చికిత్స, ఆస్పత్రుల నిర్వహణకు కేటాయిస్తున్నామని సీఎండీ వెల్లడించారు. అయినా కార్మికులు, వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ నేపథ్యాన గోదావరిఖని, కొత్తగూడెంలోని సింగరేణి ఆస్పత్రులను సూపర్ స్పెషాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

### ఎనిమిది రాష్ట్రాలకు బొగ్గు

సింగరేణి సంస్థ నుంచి ఎనిమిది రాష్ట్రాల్లో 20 థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు రవాణాకు ఒప్పందం ఉందని సీఎండీ చెప్పారు. పెరిగిన విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ఆయా కేంద్రాలకు కావాల్సిన బొగ్గు సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఈనేపథ్యాన కొత్త గనులను ప్రారంభించాల్సి ఉందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం ఉన్నందున కేంద్రప్రభుత్వంతో కూడా సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకు నుండి త్వరలోనే బొగ్గు ఉత్పత్తి మొదలుపెట్టి ఈ ఏడాది 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయనున్నామన్నారు. ఇక కొత్తగూడెంలోని వీకే ఓసీ, రామగుండం కోల్ మైన్, ఇల్లెందులోని రొంపేడు ఓసీ, బెల్లంపెల్లి ఏరియాలో గోల్లేటి ఓసీలను సైతం ప్రారంభిస్తామని చెప్పారు. కాగా, నల్లగొండ జిల్లాలో ఏర్పాటైన 4వేల మెగావాట్ల యాదాద్రి పవర్ ప్లాంట్‌కు సింగరేణి నుండి బొగ్గు సరఫరా చేయనున్నట్లు సీఎండీ వెల్లడించారు.

# ఈదురు గాలులతో విరిగిన స్తంభాలు

పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం


సత్తుపల్లి టౌన్: పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌తో సహా పడిపోయిన స్తంభం


కొణిజర్ల : మండల పరిషత్ కార్యాలయంలో విరిగిపడిన చెట్ల కొమ్మలు

సత్తుపల్లిటౌన్/కొణిజర్ల: ఈదురు గాలుల బీభత్సంతో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. బుధవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో సత్తుపల్లి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో సత్తుపల్లి టౌన్-1లో ఏరియా, వేంసూరు సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 33 కేవీ గొరిగూడెం ఫీడర్ పరిధిలో పిడుగులు పడిన కారణంగా నాలుగు పిన్ ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయి. అప్పటికప్పుడే వాటి స్థానంలో కొత్తవి అమర్చి సరఫరా పునరుద్ధరించారు. ఇక పట్టణంలోని ద్వారకాపురి కాలనీ, సదాశివునిపేట ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా, తీగలపై చెట్లు, చెట్ల కొమ్మలు పడడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది వాటిని తొలగించేందుకు శ్రమించాల్సి వచ్చింది. వివిధ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లతో సహా విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు డీఈఈ రాములు పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఇక కొణిజర్ల మండలంలోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. కొణిజర్ల పోలీస్ స్టేషన్, సాగర్ కాల్వ సమీపాన ఎనిమిది స్తంభాలు విరిగిపోగా సరఫరా నిలిచిపోయింది. దీంతో ట్రాన్స్‌కో అధికారులు జంపర్లు మార్చి కొణిజర్లకు విద్యుత్ సరఫరా అందజేశారు. మరోవైపు మండల పరిషత్ కార్యాలయంలో పలు చెట్ల కొమ్మలు విరిగిపడగా ఆఫీస్‌కు వచ్చిన వారు ఇబ్బంది పడ్డారు. అలాగే, కొణిజర్ల బీసీ కాలనీలో ఓ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి.

### పశుమాంసం అక్రమ రవాణా


పట్టుబడిన వాహనం వద్ద పోలీసులు

కల్లూరు: అక్రమంగా ఐచర్ వాహనంలో తరలుతున్న పశుమాంసం, వ్యర్థాలను గురువారం ఎస్‌ఐ షాకీర్ ఆధ్వర్యాన పోలీసులు హనుమాతండా చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. విశాఖ పట్టణం నుంచి హైదరాబాద్ తరలిస్తున్న వాహనాన్ని నిలిపి మాంసం శ్యాంపిళ్లను పరీక్షల కోసం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ఈమేరకు డ్రైవర్, క్లీనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

# ముగిసిన హెచ్‌సీఏ క్రికెట్ శిక్షణ శిబిరం


ఖమ్మంలో క్రికెటర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏసీపీ సుశీల్‌సింగ్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఏఆర్ ఏసీపీ సి.సుశీల్‌సింగ్ మాట్లాడుతూ.. నేటి ఔత్సాహికులే వర్ధమాన క్రికెటర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడగా.. శిబిరంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు చేకూరి వెంకట్, ఎం.డీ.మసూద్ పాషా, ఎం.డీ.ఫరూక్, తూరాబ్ అలీ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కల్లూరు స్టేడియంలో..**

కల్లూరు: జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన కల్లూరులోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా డీవైఎస్‌ఓ టి.సునీల్ కుమార్‌రెడ్డి పాల్గొని విద్యార్థులు నిరంతరం శిక్షణ కొనసాగిస్తూ క్రీడల్లో రాణించాలని సూచించారు. మినీ స్టేడియం ఇన్‌చార్జ్ పసుపులేటి వీరరాఘవయ్యతో పాటు కండ్రాత్రి రాధాకృష్ణ, ధర్మసోత్ సైదా, మామిడాల వెంకటేశ్వరరావు, వరకా రామారావు, మేరుగు వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.

# అంతా మా ఇష్టం..

- కేఎంసీలో విధుల్లో కానరాని సిబ్బంది
- సెలవు పెట్టకుండానే విధులకు గైర్హాజరు
- పౌర సేవల కోసం వస్తున్న వారి ఇక్కట్లు

ఖమ్మంమయూరిసెంటర్: నిత్యం వందలాది మంది వివిధ సమస్యలపై అధికారులను కలిసేందుకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వస్తుంటారు. అయితే, ఎన్నికలు, ఓట్ల లెక్కింపు తదితర కారణాలతో నెల రోజులుగా కార్యాలయంలో పనులు సక్రమంగా జరగక అర్జీదారులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో బుధవారం నుండి దాదాపు అన్ని శాఖల ఉద్యోగులు కార్యాలయాల బాట పట్టారు. కానీ కేఎంసీ కార్యాలయానికి చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మాత్రం అదేమీ పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం. గురువారం వివిధ విభాగాల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు ఏడెనిమిది మంది వరకు అధికారులకు సమాచారం ఇవ్వకుండానే హైదరాబాద్ వెళ్లినట్లు తెలిసింది. దీంతో పౌర సేవలు, ఇతర సమస్యలపై ఆయా విభాగాలకు వచ్చిన వారికి సిబ్బంది కానరాక వెనుదిరిగారు. ఇక రెవెన్యూ విభాగంలో పనికోసం ఓ వ్యక్తి కేఎంసీకి రాగా, ఆర్‌ఐను కలవాలని సూచించారు. దీంతో సదరు ఆర్‌ఐ కోసం చాలా సమయం వేచి ఉన్నా రాలేదు. చివరకు ఆయనకు ఫోన్ చేయిస్తే తాను కేఎంసీ నుండి బదిలీ కోసం దరఖాస్తు చేసుకుని ఆ పనిలో తిరుగుతున్నందున ఇప్పుడు కార్యాలయానికి రాలేనని సెలవివ్వడంతో వారు వెళ్లిపోయారు. కేఎంసీకి కీలకమైన విభాగంలో పని చేసే ఉద్యోగులే ఇలా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. ఇన్నాళ్లు ఎన్నికల పేరిట దాటవేసిన అధికారులు ఇప్పుడు కూడా విధులపై దృష్టి సారించకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. కాగా, విధులకు గైర్హాజరైన కంప్యూటర్ ఆపరేటర్ల వ్యవహారంపై కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్‌ను వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని, ఇంకా ఎవరికైనా చెప్పి వెళ్లారో కనుక్కుంటామని తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం..

చింతకాని: మండలంలోని చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాగులవంచ సమీపాన కొత్త వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం వీటిని పట్టుకున్నారు. ఈమేరకు బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.





# అద్దెకు ఉన్న ఇంటికే కన్నం

- పోలీసులకు పట్టుబడిన నిందితుడు
- రూ.7లక్షల సొత్తు స్వాధీనం

కొత్తగూడెంటౌన్: ఇంట్లో అద్దెకు దిగాక యజమానులతో మంచిగా మెదిలాడు.. వృద్ధ దంపతులకు సాయంగా ఉన్నట్లు నాలుగేళ్ల పాటు నమ్మించాడు.. ఆపై అదే నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని వృద్ధ దంపతులు ఇంట్లో లేని సమయాన 117 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగిలించిన వ్యక్తి చివరకు కటకటాల పాలడయ్యాడు. ఈమేరకు నిందితుడి వివరాలను కొత్తగూడెం టూటౌన్ సీఐ రమేష్‌కుమార్ గురువారం వెల్లడించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరం సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో నివాసముంటున్న మనోహర్ దంపతులకు చెందిన భవనంలో మహావీర్ అనే వ్యక్తి కుటుంబంతో సహా అద్దెకు దిగాడు. ఆయన యజమాని కుటుంబంతో స్నేహంగా, సాయంగా కొనసాగాడు. మనోహర్ దంపతుల పిల్లలు ఇతర చోట్ల ఉండడంతో వారితో చదివిన మెదిలిన మహావీర్ ఆభరణాలు ఎక్కడ దాస్తారో తెలుసుకున్నాడు. అనంతరం ఓ రోజు మనోహర్ ఇంట్లో ఎవరూ లేని సమయాన మారు తాళంచెవి చేయించుకున్నాడు. ఇక ఏడాదిన్నర క్రితం అమెరికాలో ఉన్న కుమారుడికి వద్దకు వెళ్లేందుకు మనోహర్ దంపతులు ప్రయత్నాలు ప్రారంభించారు. అదేసమయంలో వారు ఇంట్లో లేకపోవడంతో తన దగ్గర ఉన్న తాళంతో ఇళ్లు తెరిచి బీరువాలో భద్రపరిచ్చిన 117 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. అప్పటికే మనోహర్ దంపతులు అమెరికా బయలుదేరడంతో వారి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఇన్నాళ్లు ఆభరణాలు దాచిన మహావీర్‌కు డబ్బు అవసరం కావడంతో అమ్మేందుకు వెళ్తుండగా గురువారం రామవరం గోధుమవాగు వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణ అనంతరం ఆయన నుంచి రూ.7లక్షల విలువైన బంగారం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేష్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై రాజేష్, సిబ్బంది వెంకటేశ్వర్లు, ప్రశాంత్, వెంకట్వేరావు, రాజు పాల్గొన్నారు.

### అద్దె వాహన యజమానులతో చర్చలు

సింగరేణి(కొత్తగూడెం): భూనిర్వాసిత అద్దె వాహనాల యజమానులతో సింగరేణి అధికారులు గురువారం చర్చలు జరిపారు. నిర్వాహకులు ఇటీవల పలు అంశాలను లేవనెత్తుతూ సమ్మెకు దిగుతున్నట్లు లేఖ ఇచ్చారు. దీంతో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలోని అధికారులు వారితో భేటీ అయ్యారు. బిల్లుల్లో ఆపిన 15శాతం మొత్తాన్ని వెనక్కి ఇవ్వాలనే అంశంపై ప్రధానంగా చర్చ జరగగా, పరిపాలనపరంగా ఎదురయ్యే సమస్యలను అధికారులు వివరించారు. అద్దె వాహనాల డ్రైవర్ల సీఎంపీఎఫ్ ఖాతాల్లో నగదు చేయాల్సి ఉందని.. అలాకాకుండా వెనక్కి ఇస్తే కోర్టు ఉత్తర్వులు ధిక్కరించినట్లవుతుందని తెలిపారు. ఈమేరకు అద్దె వాహనదారులు సమ్మె విరమించి యాజమాన్యానికి సహకరించాలని కోరారు. దీంతో చర్చించి తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామని డ్రైవర్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల అధికారులు ఎస్.జగన్మోహన్‌రావు, దీక్షితులు, టి.సురేష్‌బాబు, వెంకయ్య, బి.రవి, అజయ్‌కుమార్, వరప్రసాద్, రాజేశ్వరరావు, రామశేషయ్య, ఎల్.తిరుపతి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.






### ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

కారేపల్లి: మండలంలోని భాగ్యనగర్‌తండాలో గల ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భాగ్యనగర్‌తండా బొడ్రాసికుంట శ్రీఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి, తొలుత ఆలయ ప్రాంగణంలో ఉన్న రెండు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం ఆలయ గర్భగుడి ముందు ఉన్న హుండీ తాళం పగులకొట్టి అందులోని సుమారు రూ.10వేల నగదును అపహరించుకపోయినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న కారేపల్లి ఎస్‌ఐ ఎస్.రాజారాం గురువారం ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

### రూ.1.33లక్షల విలువైన మద్యం..

చింతకాని: మండలంలోని నాగులవంచలో ఉన్న లక్ష్మీనర్సింహస్వామి వైన్స్‌లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి సమయాన వైన్స్ తాళాలు పగులగొట్టి సుమారు రూ.1,33,760 విలువైన మద్యం సీసాలను ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని గురువారం ఉదయం గుర్తించగా, క్యాషియర్ మడుగుల భిక్షం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

### వడదెబ్బతో వ్యక్తి మృతి


నర్సింహారావు (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం 16వ డివిజన్ కొత్తూరుకు చెందిన వల్లెపు నర్సింహారావు(50) వడదెబ్బ బారిన పడి మృతి చెందాడు. వారం క్రితం వడదెబ్బకు గురైన ఆయనకు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా గురువారం మృతి చెందాడని బంధువులు తెలిపారు. నర్సింహారావుకు భార్య నళిని, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, ఆయన చిన్న కుమారుడు అవినాష్ ఏడు నెలల క్రితం ఓ ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఇంతలోనే నర్సింహారావు మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

### చికిత్స పొందుతున్న వ్యక్తి..

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పిండిప్రోలుకు చెందిన కాంపాటి రమేష్(45) గత నెల 31న రాత్రి ఖమ్మం నుంచి ఇంటికి వస్తుండగా తిరుమలాయపాలెం భవానీ హోటల్ సమీపాన రోడ్డుపై ఉన్న గేదెను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. ఈ మేరకు రమేష్ పరిస్థితి విషమించి గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఆయనకు భార్య సుగుణ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

### తలసేమియాతో విద్యార్థిని..



సీతామహాలక్ష్మి (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని పైడాకులమడుగు గ్రామానికి చెందిన విద్యార్థిని సోడి సీతామహాలక్ష్మి(16) సికిల్‌సెల్ తలసేమియా వ్యాధితో బాధపడుతూ మృతి చెందింది. ఆమె ఏడాది కాలంగా ఈ వ్యాధితో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈమేరకు పరిస్థితి విషమించగా గురువారం సీతామహాలక్ష్మి మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

### బీటీపీఎస్ ఉద్యోగి..

పాల్వంచ: బీటీపీఎస్ ఉద్యోగిని ఆకస్మికంగా మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని గట్టాయిగూడెంలో నివాసం ఉంటున్న బీటీపీఎస్ ఉద్యోగిని చాట్ల రాధ (40) నీరసంగా ఉందని గురువారం డ్యూటీకి వెళ్లకుండా ఇంట్లోనే ఉంది. దీంతో భర్త రజినీకాంత్ ఆర్‌ఎంపీ వైద్యుడిని తీసుకొచ్చేందుకు బయటకు వెళ్లి.. తిరిగి ఇంటికి వచ్చే సరికి అపస్మారక స్థితిలో ఉంది. వెంటనే కేటీపీఎస్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వడదెబ్బ వల్ల చనిపోయి ఉండొచ్చని తండ్రి సైదులు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 12న చంద్రబాబు ప్రమాణ స్వీకారం



సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రిగా ఈనెల 12న చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్నారు. తొలుత 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేయాలని నిర్ణయించినా అదేరోజు ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేస్తుండడం .. ఆ కార్యక్రమానికి హాజరవ్వాల్సి వుండడంతో చంద్రబాబు తన కార్యక్రమాన్ని 12కు వాయిదా వేసుకున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. ఆ రోజున రాజధాని ప్రాంతంలో భారీ బహిరంగ సభ ఏర్పాటుచేసి ప్రమాణ స్వీకారం చేయడానికి ఏర్పాట్లుచేస్తున్నారు. దానికి ముందు 11వ తేదీన టీడీపీ శాసనసభా పక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఆ రోజు టీడీపీ ఎమ్మెల్యేలు చంద్రబాబును టీడీపీ పక్ష నేతగా ఎన్నుకుంటారు. చంద్రబాబును టీడీఎల్పీ నేతగా ఎన్నుకుని గవర్నర్‌కు నివేదించాక 12న ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన రోజే తొలి విడతగా కొందరిని మంత్రులుగా ప్రమాణం చేయించనున్నట్లు తెలిసింది. సుమారు పది మందికి తొలి విడతలో అవకాశం దక్కే పరిస్థితి కనిపిస్తోంది. టీడీపీ నుంచి ఐదారుగురు, జనసేన, బీజేపీ నుంచి నలుగురు ఆ జాబితాలో ఉండే అవకాశం ఉంది. తొలి విడతలో కింజరాపు అచ్చెన్నాయుడు, ధూళిపాళ్ల నరేంద్ర, చింతకాయల అయ్యన్నపాత్రుడు, పి. నారాయణ, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు వంటి వారికి అవకాశం ఉంటుందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. జనసేన నుంచి పవన్‌కళ్యాణ్ మంత్రివర్గంలో చేరతారా లేదా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. బీజేపీ తరఫున సుజనాచౌదరికి తొలి విడతలోనే మంత్రివర్గంలో చోటు దక్కించుకోవడం ఖాయమని చెబుతున్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా ఆనం రామనారాయణరెడ్డిని నియమించే యోచనలో టీడీపీ ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

**టీడీపీకి లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి?**

ఎన్డీయే భాగస్వామ్య పక్షాల్లో ప్రధాన పార్టీగా ఉండడంతో టీడీపీ లోక్‌సభ స్పీకర్ పదవిని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, బీజేపీ అగ్రనేతలు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఒకవేళ చంద్రబాబు ఆ పదవి కావాలని గట్టిగా పట్టుబడితే ఏమైనా నిర్ణయం మారే అవకాశం ఉందంటున్నారు. కేంద్ర మంత్రివర్గంలో టీడీపీ ఐదుకి పైగా స్థానాలు కోరుతుండడం, కీలకమైన జల్‌శక్తి, రవాణా వంటి శాఖలు అడుగుతుండడంతో దానిపైనా రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీజేపీ పౌర విమానయాన, ఉక్కు శాఖలను టీడీపీకి ఇవ్వాలని యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

# యథేచ్ఛగా హింస

## కఠిన చర్యలు తీసుకోండి.. గవర్నర్‌ను కోరిన వైఎస్సార్‌సీపీ

### సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేసిన పార్టీ నేతలు

### పోలీసులు ఏం చేస్తున్నారని గవర్నర్ విస్మయం



గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: అధికారం చేపట్టక ముందే టీడీపీ, జనసేన నాయకులు యథేచ్ఛగా సాగిస్తున్న హింసాకాండపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైఎస్సార్ సీపీ నేతలు గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విన్నవించారు. ఈమేరకు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, అరకు ఎంపీ తనూజ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీ కేశినేని నాని, అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి గవర్నర్‌కు గురువారం వినతిపత్రం అందచేసిన అనంతరం మాజీ మంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు అనంతరం బిహార్ తరహాలో రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసకాండ, హింసాత్మక ఘటనలను గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. టీడీపీ మూకలు ఎన్నికల రోజు మధ్యాహ్నం నుంచే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరుల ఇళ్లపై దాడులకు తెగబడి పలు చోట్ల గృహ దహనాలు, ఆస్తులను ధ్వంసం చేశాయన్నారు. మహిళలు, పిల్లలను సైతం హింసించి భయ భ్రాంతులకు గురిచేశాయని తెలిపారు. టీడీపీ, జనసేన విధ్వంస కాండకు సంబంధించి వీడియో, ఫొటో ఆధారాలను పరిశీలించి విస్తుపోయిన గవర్నర్.. పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారన్నారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని, కళ్ల ముందే దాడి జరిగినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయడం లేదని గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు వెల్లడించారు. నూజివీడులో కౌన్సిలర్‌పై పోలీసుల సమక్షంలోనే కత్తులతో దాడి జరగటాన్ని గవర్నర్ దృష్టికి తెచ్చామన్నారు. ఈ ఘటనలపై డీజీపీతో చర్చించి చర్యలు తీసుకుంటానని గవర్నర్ హామీ ఇచ్చారన్నారు.

**పర్యవసానాలు తప్పవు**

వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకున్న వారిపై దాడులు చేసేందుకే అధికారంలోకి వచ్చారా? అని టీడీపీ నేతలను పేర్ని నాని ప్రశ్నించారు. ఎర్ర పుస్తకం పేరుతో హింసకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లకాలం మీరే అధికారంలో ఉండరనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని కూటమి నాయకులకు సూచించారు. చంద్రబాబు ఒత్తిడితో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. దాడులను ఆపకుంటే పర్యవసానాలు తప్పవని హెచ్చరించారు.

**కార్యకర్తలను కాపాడుకునేందుకు కమిటీలు, లీగల్ టీమ్స్**

రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను కాపాడుకునేందుకు 26 జిల్లాల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ప్రత్యేక కమిటీలను వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసినట్లు పేర్ని నాని వెల్లడించారు. బాధితులను పరామర్శించడంతో పాటు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ హింసాకాండను మీడియా ద్వారా ప్రపంచానికి తెలియజేస్తామన్నారు. 26 జిల్లాలో ఏర్పాటైన లీగల్ టీమ్‌లు బాధితులకు అండగా నిలుస్తాయని, శుక్రవారం నుంచి చురుగ్గా పని చేస్తాయని తెలిపారు. కింది స్థాయి పోలీసులు కేసులు నమోదు చేయకుంటే ఎస్పీలను కలిసి న్యాయం కోసం పోరాటం చేస్తామన్నారు.

## మా ప్రాణాలు కాపాడండి

- ఏపీలో వ్యవస్థీకృత హింసపై సుప్రీంను ఆశ్రయించిన బాధితులు
- ఎన్నికల అనంతరం రాష్ట్రంలో భయానక పరిస్థితులు
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులపై యథేచ్ఛగా దాడులు
- గ్రామాలు వీడకుంటే చంపేస్తామంటూ హెచ్చరికలు
- ఆస్తుల ధ్వంసం.. మహిళలు, పిల్లలను హింసిస్తున్నారు
- పోలీసుల నిర్లిప్తతతో అసాంఘిక శక్తులు పేట్రేగుతున్నాయి
- సాక్ష్యాధారాలతో ఈ–మెయిల్ ద్వారా సీజేఐకి బాధితుల ఫిర్యాదు
- సుమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించి విచారించాలంటూ అభ్యర్థన

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులపై ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై రాజకీయ ప్రత్యర్థులు, అసాంఘిక శక్తులు దాడులతో వ్యవస్థీకృత హింసకు పాల్పడుతుండటంపై బాధితులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. గ్రామాలు, ఆస్తులను వదిలేసి కట్టుబట్టలతో వెళ్లకుంటే హతమారుస్తామంటూ హెచ్చరిస్తున్నారని, ఆస్తులను ధ్వంసం చేస్తూ పిల్లలు, మహిళలను సైతం హింసిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయని విన్నవించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న వ్యవస్థీకృత హింసను సుమోటోగా ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)గా స్వీకరించి ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించాలని అభ్యర్థించారు. వ్యవస్థీకృత హింసకు సంబంధించి మీడియా కథనాలు, సోషల్ మీడియా వీడియోల సాక్ష్యాధారాలతో బాధితులు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి గురువారం ఈ–మెయిల్ ద్వారా పిర్యాదు చేశారు.

**బాధితుల ఆక్రందన ఇదీ..**

- ప్రస్తుతం రాష్ట్రంలోని పాలనా యంత్రాంగంలో నెలకొన్న అస్థిర పరిస్థితులను ఆసరాగా చేసుకుని అసాంఘిక శక్తులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులు, పిల్లలు, మహిళలపై వ్యవస్థీకృత హింసకు పాల్పడుతున్నాయి. ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయి.
- పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరించడంతో అసాంఘిక శక్తులు యథేచ్ఛగా విధ్వంసానికి పాల్పడుతున్నాయి. గత 24 గంటల్లో హింసాత్మక సంఘటనలు భారీగా పెరిగాయి.
- సర్వోన్నత న్యాయస్థానం తక్షణమే స్పందించి చర్యలకు ఆదేశించకుంటే ఈ వ్యవస్థీకృత హింస నుంచి బాధితులకు రక్షణ లభించదు. ఈ అంశాన్ని సుమోటో పిల్‌గా స్వీకరించి విచారించాలి. రాష్ట్ర ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడాలి.

## వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ కార్యకర్తల దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం



తలకు గాయాలైన తలతోటి దావీదు



తలకు తీవ్ర గాయాలైన మద్దూరి పౌలు

యడ్లపాడు : వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కారుచోల గ్రామంలో గురువారం జరిగింది. ఎస్సీ కాలనీలోని చర్చి కింద జాలాది మార్గంలోని చెరువులో సుమారు 3.5 ఎకరాల ఆక్రమిత సాగుభూమి ఉంది. దీనిపై వచ్చే ఆదాయాన్ని ఏటా సంఘ పెద్దలు చర్చి అభివృద్ధి పనులకు వినియోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో గతేడాది కౌలుకు తీసుకున్న కనపర్తి రత్తయ్య తన కౌలు డబ్బులు ఇస్తానంటూ చర్చికి రావాలని సంఘ పెద్దల్ని కోరాడు. దీంతో సంఘ పెద్దలు ఆరుగురు బెజ్జం అనిల్, వలేరు లాజర్, వడ్లానం మాణిక్యరావు, గడ్డ సీమోను, తిరుపతి రామారావు, మద్దూరి మనోహర్, తలతోటి దావీదు చర్చికి చేరుకుని కౌలు డబ్బులతో చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించుకున్నారు. పెద్దలంతా చర్చి నుంచి బయటకు వస్తున్న క్రమంలో ఆ ప్రాంతానికి వచ్చిన గ్రామ టీడీపీ నాయకుడు మైలవరపు వెంకట కోటయ్య.. సంఘ పెద్ద, వైఎస్సార్‌సీపీ నాయకుడైన తలతోటి దావీదుతో వాగ్వాదం పెట్టుకున్నాడు. అదేకాలనీలోని తమ పార్టీ కార్యకర్తల్ని రెచ్చగొట్టి.. దాడికి దిగారు. దావీదుతో వచ్చిన మరో పెద్ద మద్దూరి మనోహర్ పరారు కాగా, దావీదును నాపరాయితో తలపై మోదారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మద్దూరి మనోహర్ అనే వలంటీర్ దావీదును చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. ఇదిలా ఉండగా పొలం నుంచి కాలనీ వైపు టీవీఎస్‌పై వస్తున్న మద్దూరి పౌలు.. టీడీపీ కార్యకర్తలు కర్రలతో రావడం గమనించి బండి వెనక్కు తిప్పే ప్రయత్నం చేశాడు. అతన్ని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో పట్టుకుని దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.

## అరాచకాన్ని అరికట్టండి

**ఏపీలో విధ్వంసకాండపై రాష్ట్రపతికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు**

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ మద్దతుదారులు, సానుభూతిపరులపై యథేచ్ఛగా కొనసాగుతున్న దాడులు, హింసాకాండను తక్షణం అరికట్టేలా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను పార్టీ కోరింది. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల విడుదల అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న వేళ అల్లరిమూకలు సంధి కాలాన్ని ఎంపిక చేసుకుని విధ్వంసాలకు తెగబడటం వెనుక పక్కా కుట్ర ఉందని స్పష్టం చేసింది. అరాచక శక్తులు చెలరేగుతున్నా పోలీసు యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడం పరిస్థితిని మరింత దిగజారుస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో శాంతి భద్రతలను పునరుద్ధరించేలా తక్షణం కఠిన చర్యలకు ఆదేశించాలని కోరింది. ఈమేరకు రాష్ట్రపతి, గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఎస్.నిరంజన్ రెడ్డి గురువారం విడివిడిగా లేఖలు రాశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను అరికట్టి ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను మరో లేఖ ద్వారా కోరారు.

## ఊరూరా విధ్వంసం.. అదే టీడీపీ లక్ష్యం

- పలుచోట్ల శిలాఫలకాలు, వైఎస్సార్ విగ్రహాలపై దాడి
- ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు కూల్చివేత
- సచివాలయాలపై అక్కసుతో పేట్రేగిన వైనం
- విజయనగరంలో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రచ్చ
- సంకురాత్రిపాడులో బోర్డులు, శిలాఫలకాలు, దిమ్మెలు ధ్వంసం
- సచివాలయంపై టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

**జిల్లా వార్తలు**

## పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన పూజలు



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన పూజ చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాధపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో అమ్మవారికి గురువారం సువర్ణ పుష్పార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. ఈమేరకు అర్చకులు అమ్మవారికి సువర్ణ పుష్పార్చనతో పాటు హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపించారు. పూజల్లో ఈఓ జి.సుదర్శన్, అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## యువత పాలకులను నిలదీసేలా ఉండాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

కామేపల్లి: పాలకులు అనుసరిస్తున్న తప్పుడు విధానాలను యువత ప్రశ్నించాలే తప్ప వారికి అనుకూలంగా వ్యవహరించొద్దని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య సూచించారు. కామేపల్లి మండలం ముచ్చర్లలో గురువారం ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. రాజకీయాలు కులం, మతం చుట్టూ తిరుగుతున్న పరిస్థితుల్లో యువతకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని తెలిపారు. జిల్లాలో అపారమైన ఖనిజ సంపదలు ఉన్నా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదన్నారు. ఈ పరిస్థితిలో మార్పు వచ్చేలా యువత ప్రయత్నించాలని సూచించారు. అనంతరం పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్ 'యువత – కర్తవ్యాలు' అంశంపై మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు ప్రేమ్‌సింగ్, ఎస్.వీ.రాకేష్, పుల్లయ్య, ఆవుల అశోక్, ఝాన్సీ, భరత్‌మోహన్‌రెడ్డి, మందా సురేష్, అరుణ్‌కుమార్, మామిడాల వెంకటేష్, మధు, సంపత్, రవీందర్, శివలాల్, చల్లా రాజు, కనక రాజు, సక్రాం తదితరులు పాల్గొన్నారు.

# నీరు అందితేనే సాగు భళా!

- సాగు అవసరాల కోసం రైతుల పాట్లు
- బావుల్లో పూడిక పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు
- గతేడాది వర్షాభావంతో ఎడతెగని తిప్పలు
- ఈసారి ముందుగానే పూడిక తీస్తే ఇబ్బందులు తప్పుతాయని ఆశ



ఖమ్మం రూరల్ మండలం పోచారంలోని ఓ బావిలో క్రేన్‌తో పూడిక తీస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్: గత యాసంగిలో రూ.లక్షలు పెట్టుబడిన సాగు చేసిన పంటలకు చివరి దశలో నీరు అందక రైతులు పెట్టుబడి కూడా దక్కించుకోలేక నానా తిప్పలు పడ్డారు. గత ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో సాగర్ జలాలు విడుదల కాలేదు. ఆపై భూగర్భ జలాలు కూడా ఎండిపోవడంతో పాలేరు నియోజకవర్గంలోని సాగర్ ఆయకట్టుతో పాటు ఇతర ప్రాంతాల్లో బావుల, బోర్ల ఆధారంగా పంటలు సాగు చేసే రైతులు నష్టం ఎదుర్కొన్నారు. సాగర్ ఆయకట్టు కింద రబీలో వేసిన వరి సగానికిపైగా ఎండిపోయింది. అదే విధంగా మిర్చి పంటకు చివరి కోత సమయంలో బావులు, బోర్లలో నీరులేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. దీంతో ఈసారి అలా జరగొద్దని ముందస్తుగానే బావుల్లో పూడిక తీయించే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు.

**ఆ పరిస్థితి రావొద్దు..**

గతేడాది పరిస్థితులు పునరావృతమైనా నీటి కోసం ఇబ్బంది రావొద్దనే భావనతో రైతులు ముందస్తుగానే బావుల్లో పూడిక తీయించడమే కాక బోర్లను ఫ్లషింగ్ చేయించే పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాలు రాక ముందే ఈ పనులు పూర్తిచేస్తే కొద్దిపాటి వర్షం కురిసినా నీరు నిల్వ ఉంటుందనే భావన వ్యక్తమవుతోంది. దీంతో అప్పులు తెచ్చి మరీ వ్యయప్రయాసల కోర్చి పూడిక తీసే పనులుచేపడుతున్నారు. జిల్లాలోని తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం రూరల్, నేలకొండపల్లితో పాటు ఇతర మండలాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. చాలాచోట్ల బావులను ఇప్పటికే 5 నుంచి 7 కండాల వరకు లోతు తవ్వించారు. అందులో దాదాపు ఆరు అడుగుల నుంచి 10 అడుగుల మేర పూడిక పేరుకుపోవడంతో వచ్చే జలం కూడా ఆగిపోయి గతేడాది పంటలకు సాగునీరు అందలేదు. ఈసారి వర్షాభావ పరిస్థితులు ఎదురైనా ఇక్కట్లు ఎదురుకావద్దనే భావనతో రైతులు ముందుస్తుగా సిద్ధమవుతున్నారు. కాగా, ఒక్కో బావికి పూడిక లోతును బట్టి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతోందని అంచనా. వర్షాలు ఆరంభం కాక ముందే పూడిక తీసే పనులు సజావుగా సాగుతాయనే ఉద్దేశంతో రైతులు పోటీ పడుతున్నారు.

**ఈఏడాదైనా వరుణుడు కరుణిస్తాడా?**

ఈ ఏడాదైనా వరుణుడు కరుణిస్తాడా, లేదా అన్న మీమాంస అన్నదాతలను వెంటాడుతోంది. మంచి వర్షాలు వస్తేనే బావులు, బోర్లలో ఆశించిన స్థాయిలో నీరు చేరి పంటలు పండుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, కృష్ణా బేసిన్‌లో కూడా వర్షాలు సరిపడా కురిస్తే సాగర్ నుంచి నీటి విడుదలకు ఇక్కట్లు ఉండవని చెబుతున్నారు. గతేడాది పంట చేతికొచ్చే దశలో వర్షాలు లేక ఎండిపోగా అప్పులు తీర్చలేకపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈసారి అలా జరగకుండా అప్పులు చేసి మరీ బావులు, బోర్లలో పూడిక తీయిస్తుండడం రైతుల పరిస్థితిని తెలియజేస్తోంది.

**రూ.50వేలు ఖర్చు చేశా..**



గత ఏడాది నాలుగెకరాల్లో వరి, మిర్చి, పత్తి పంటలు వేశా. పంట చేతికందే దశలో వర్షాలు లేక బావిలో నీరు ఇంకిపోయి ఇబ్బంది ఎదురైంది. దీంతో రెండెకరాల్లో మిర్చి ఎండిపోయి రూ.లక్ష మేర పెట్టుబడి కూడా రాలేదు. ఆ పరిస్థితి రావొద్దని రూ.50వేలు అప్పు తెచ్చి పూడిక తీయించా.

– వాగంటి వీరయ్య, రైతు, పోచారం

**పూడిక తీస్తేనే బావిలో ఊటనీరు..**



గతేడాది ఐదు ఎకరాల్లో మిర్చి వరి వేసిన. అయితే, బావిలో పూడిక పేరుకుపోయి నీరు అందక పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో ఈసారి అలా జరగకుండా ముందుగానే రూ.30వేలు ఖర్చు చేసి బావిలో పూడిక తీయిస్తున్నా. పూడికతీతతో బావిలో కొంత మేరకైనా ఊటనీరు వస్తుందని ఆశ.

– నర్రా వెంకటనర్సయ్య, రైతు, చేగొమ్మ

## కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులకు ప్రవేశాలు



విద్యార్థినికి ప్రవేశపత్రం అందజేస్తున్న డీడీ సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న కార్పొరేట్ కళాశాలల ప్రవేశాల పథకానికి సంబంధించి విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తికావడంతో ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ ప్రవేశపత్రాలను అందజేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని డీడీ కార్యాలయంలో గురువారం దరఖాస్తుల పరిశీలన చేపట్టగా, వంద మందికి గాను 84 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించాక కోరుకున్న కళాశాలల్లో ప్రవేశానికి అనుమతిస్తూ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీడీ సత్యనారాయణ మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలల పథకాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారులు శ్రీలత, కె.వెంకటేశ్వరరావు, ఉద్యోగులు హన్మంతరావు, మురళీకృష్ణ, ఆర్‌వీఆర్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఖమ్మం మార్కెట్‌లో కొనుగోళ్లు

ఖమ్మంవ్యవసాయం: ఎండ తీవ్రతతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నిలిపివేసిన పంట ఉత్పత్తుల కొనుగోళ్లను శుక్రవారం తిరిగి ప్రారంభించనున్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యాన కార్మికులు, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అభ్యర్థనతో మే 11 నుంచి ఈనెల 6వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం, వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతుల పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలకు అనుగుణంగా మార్కెట్ తెరవాలని నిర్ణయించారు. ఈమేరకు నేటి నుంచి రైతులు పంట ఉత్పత్తులను తీసుకురావొచ్చని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు.

## విద్యార్థులకు అన్ని వసతులతో స్వాగతం పలకాలి

**భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్**



కళాశాలలో పరిసరాలను పరిశీలిస్తున్న పీఓ

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని డిగ్రీ, జూనియర్ కళాశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో చేపట్టిన పనులన్నీ పూర్తిచేసి గిరిజన విద్యార్థులకు ఈనెల 12న స్వాగతం పలకాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని కూనవరం రోడ్డులో ఉన్న గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, బాలికల ఆశ్రమ పాఠశాలలో కొనసాగుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. డార్మిటరీ, తరగతి గదులు, టాయిలెట్లను పరిశీలించి కొన్ని గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు లేనందున ఈనెల 10వ తేదీలోగా అమర్చాలని ఆదేశించారు. అదే విధంగా సరిపడా మంచాలు తెప్పించాలని చెప్పారు. ఆపై పనికిరాని వస్తువులను బయటకు తరలించాలని, ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, కళాశాలల వార్డెన్లు పార్వతి, లక్ష్మి, హెచ్‌ఎంలు సుభద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు.

**వాహనానికి వేలం, కోడిగుడ్లకు టెండర్ల ఆహ్వానం..**

భద్రాచలం ఐటీడీఏలో మహేంద్ర స్కార్పియో వాహనాన్ని విక్రయించేందుకు ఈనెల 13న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పీఓ ప్రతీక్‌జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే, భద్రాద్రి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధి పాఠశాలలు, హాస్టళ్లకు అవసరమైన కోడిగుడ్లు, చికెన్, పాలు సరఫరా చేయడానికి ఆసక్తి ఉన్నవారు ఈనెల 10 నుంచి 18వ తేదీ సాయంత్రం 5గంటల వరకు టెండర్లు దాఖలు చేయాలని సూచించారు.

## ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి



రైల్వే అధికారులకు సూచనలు చేస్తున్న ఏడీఆర్ఎం గోపాల్

మధిర: తొండల గోపవరం, మధిర రైల్వేస్టేషన్లలో జరుగుతున్న ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని అసిస్టెంట్ డివిజనల్ రైల్వే మేనేజర్ (ఏడీఆర్ఎం) ఎం.గోపాల్ ఆదేశించారు. విజయవాడ నుంచి ప్రత్యేక రైలులో వచ్చిన ఆయన గురువారం మధిర మండల పరిధి తొండల గోపవరం రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేశాక మధిర చేరుకున్నారు. ఆయా స్టేషన్లలో ప్లాట్ ఫామ్, ఆధునికీకరణ పనులను పరిశీలించి ప్రయాణికులకు మెరుగైన వసతులను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు ఏలూరు నాగేశ్వరరావు, చిలివేరు సాంబశివరావు తదితరులు మధిరలో నవజీవన్‌కు హాల్టింగ్ ఇవ్వాలని, ఇతర రైళ్లను కరోనా ముందు మాదిరి నిలపాలని, మధిర పాత రైల్వే గేట్ ప్రాంతంలో అండర్ పాస్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఏడీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు సుధీర్ బాబు, పద్మారావు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ తనిఖీ

తల్లాడ: తల్లాడలో 108 అంబులెన్స్‌ను ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేంద్ర గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని పరికరాలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. అత్యవసర పరిస్థితి ఎదుర్కొంటున్న వారి నుంచి ఫోన్ రాగానే త్వరగా ఘటనాస్థలానికి చేరుకుంటే ప్రాణనష్టం తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీ రామారావు, పైలట్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## పోస్టుల భర్తీకి 11 నుంచి రాత పరీక్షలు

ఖమ్మం లీగల్: ఖమ్మంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన కొనసాగుతున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కార్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఖాళీగా ఉన్న మూడు పోస్టుల భర్తీకి ఈ నెల 11వ తేదీ నుంచి రాతపరీక్షలు నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. గత మార్చిలో ఈ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించగా, తిరస్కరించినవి పోగా మిగిలిన వారికి నైపుణ్యం, మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారు. కాగా, ఆఫీసు అసిస్టెంట్ క్లర్క్ పోస్టుకు 11న, డేటా ఎంట్రీ ఆపరేటర్, రిసెప్షనిస్ట్ పోస్టుకు 12న, ప్యూన్ అటెండెంట్ పోస్టుకు 13న పరీక్ష ఉంటుందని జిల్లా జడ్జి తెలిపారు. అభ్యర్థులకు వ్యక్తిగతంగా సమాచారం అందదని, జిల్లా కోర్టు అధీకృత వెబ్‌సైట్ లేదా న్యాయ సేవా సంస్థ కార్యాలయం నోటీసు బోర్డులో సమాచారం ఆధారంగా అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.